మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ బస్వ సావిత్రి

గ్రామ పాలనపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బస్వ సావిత్రి

దేవరుప్పుల, మార్చి 21 : సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో గ్రామ పాలనపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఆమె అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి వసతి, శుభ్రత, నర్సరీలు, హరితహారం, దోమల బెడదపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. తహసీల్దార్ హుస్సేన్ రేషన్‌కార్డులు, నిత్యావసర వస్తువుల సరఫరాపై నివేదిక చదివారు.

సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయని, నవాబుపేట రిజర్వాయర్ ద్వారా కాలువలకు నీరు వదలాలనే తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపాలని సభలో నిర్ణయించారు. ప్రజాపాలనలో అమలు కావాల్సిన గ్యారెంటీల్లో అవకతవకలపై ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు.

సమావేశంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బీ వెంకటేశ్వర్లు, చేనేత జౌళి శాఖ సంచాలకుడు పల్లా చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్, ఎంపీటీసీలు జాకీర్, ఆశాజ్యోతి, గొడుగు సుజాత, ఉపేందర్, కోఆప్షన్ సభ్యుడు మజర్‌పాషా, విద్యుత్‌శాఖ ఏఈ సుధాకర్, వైద్యాధికారి మనోజ్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ మానస, ఇరిగేషన్ ఏఈ విద్యాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్వరున్నీసాబేగం, విద్యాశాఖ నుంచి గోలి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



రఘునాథపల్లి : మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే కడియం పరామర్శ

రఘునాథపల్లి, మార్చి 21 : మండలంలోని వెల్దిలో బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందిన బర్మ రవి కుటుంబాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే కుర్చపల్లి ఎంపీటీసీ వట్టిపల్లి విజయ భర్త వట్టిపల్లి రాజిరెడ్డికి ప్రమాద వశాత్తు గాయాలు కాగా ఆయనను పరామర్శించారు. కడియం వెంట మాజీ జడ్పీటీసీ మారజోడు రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు చెంచు రమేశ్, ద్వావర యాకయ్య, పెద్దగోని యాదగిరి, పెద్దగోని రాజు, గ్రామస్తులు తదితరులున్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని తీగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోనెల జయపాల్‌రెడ్డి తల్లి నాగలక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం దశదిన కర్మకు హాజరయ్యారు. మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సుధాకర్‌బాబు ఉన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

లింగాలఘనపురం, మార్చి 21 : ఓ కూతురు తన తండ్రికి తలకొరివి పెట్టిన విషాద ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లింగాలఘనపురానికి చెందిన కేమిడి బాబు (42) అనారోగ్యంతో మృతి చెందాడు.

ఆయనకు భార్య కవిత, కూతుళ్లు శ్రావణి, కావ్య, శరణ్య ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు శ్రావణి అన్నీ తానై తన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★BS ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీలో పనిచేయుటకు చురుకైన రిసెప్షనిస్ట్, బిజినెస్ డెవలపర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ (స్త్రీలు/పురుషులు) అర్జెంటుగా కావలెను. VRS వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వబడును. Cell: 7799777394
NTW-321499

HMDA & RERA PLOTS

★3-5 సంవత్సరాలలో Future City బీబీనగర్‌లో 200 ఎ॥ AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA ప్లాట్లు 60% లోన్‌తో గేటెడ్ కమ్యూనిటీలో కలవు: 8109994456.
NT-320386

ఉచిత వైద్య శిబిరం

★మార్చి 22, 23 శుక్ర, శనివారం ఉచితంగా డెంటల్ OP చూడబడును. ఉచితంగా డెంటల్ మందులు ఇవ్వబడును. యోగానంద హాస్పిటల్, DLR గార్డెన్ ప్రక్కన, ములుగు. సెల్: 7901234546.
NTW-322934

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

మహిళలు పోషకాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ అధికారులు
- అంగన్‌వాడీల్లో ఘనంగా పోషణ పక్షోత్సవాలు

దేవరుప్పుల : చినమడూరు అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

దేవరుప్పుల, మార్చి 21 : చిరుధాన్యాల్లో అనేక పోషక విలువలున్నాయని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. చినమడూరు, ధర్మగడ్డ తండాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరునెలలు నిండిన బాలబాలికలకు అన్నప్రాసన చేయించారు. సఖీ టీం సభ్యులు మహిళల హక్కులు, చట్టాలు, డయల్ 181, గృహహింస తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమాల్లో మహిళాధ్యక్షురాలు గోరమ్మ, మంగమ్మ, జ్యోతి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, నర్మద, లలిత, స్వరూపారాణి, సుజాత, ఆశ వర్కర్లు స్వప్న, శోభ, ఎలేంద్ర, ఆయాలు నాగమణి, రజిత పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

రఘునాథపల్లి : చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్స్ ఎండీ ఫాతిమ, సుప్రియ అన్నారు. మండలంలోని కోమల్లలో 1, 3 అంగన్‌వాడీ సెంటర్లలో గురువారం నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, మూడేళ్లు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణిలు, చిన్నారులు పాలు, గుడ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రజిత, ఆయాలు పిట్టల స్వప్న, చింతకింది సరోజన, ఆశ వర్కర్లు మేకల హేమలత, కన్నారపు భాగ్యలక్ష్మి, బొల్లపల్లి సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

లింగాలఘనపురం : పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఆరోగ్యమని డీడబ్ల్యూవో జయంతి అన్నారు. మండలంలోని బండ్లగూడెం రైతువేదికలో గురువారం జరిగిన పోషణ్ పక్వాడాలో ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆకుకూరల వల్ల కలిగే సత్ఫలితాలను వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఎంపీవో మల్లికార్జున్, ఏసీడీపీవో విక్టోరియారాణి, మండల వైద్యాధికారి కరుణాకర్‌రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సావిత్రి, హంసమ్మ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్ : పోషణ్ పక్వాడాలో భాగంగా మండలంలోని మీదికొండలో ఒకటవ అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ ఆధ్వర్యంలో గురువారం మామిడి తోటలో పనిచేస్తున్న మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు తీసుకోవాలని, అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆయా రాధిక పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి సూచించారు. గురువారం మండలంలోని బమ్మెర పెద్దతండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను రంగవల్లుల రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోమల, శారద, స్వర్ణలత పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవళిక, ఏఎన్ఎంలు రోజారాణి, సుమలత, సునీత, టీచర్లు మంద రేణుక, సట్ల కవిత, గాదె స్వప్న, ఎడ్ల అరుణ, ఆశలు, అయాలు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి:బమ్మెర పెద్ద తండాలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది

మీదికొండలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

లింగాలఘనపురం : మాట్లాడుతున్న జిల్లా అధికారి జయంతి

పూజలో పాల్గొన్న ఉత్సవ కమిటీ చైర్మన్ యాదవరెడ్డి, సభ్యులు

కనుల పండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

చిల్పూరు, మార్చి 21 : మండల కేంద్రంలోని శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆలయంలోని ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఉదయం నిత్యవిధి హోమం, రాత్రి 8 గంటలకు ఎదుర్కోళ్లు నిర్వహించారు. శుక్రవారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి తెలిపారు. పూజల్లో ఆలయ శాశ్వత దాత, మాజీ చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి, మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి తీగల మహేందర్, మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, సముద్రాల కృష్ణమాచార్యులు, పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న రాష్ట్ర నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 21 : తమ సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మలు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసిన వారు తమ సమస్యలను వివరించి ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం సీఎం దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర కార్యదర్శి గద్దె సత్యనారాయణ, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు వీ మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు ఎల్ వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణమాచార్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మారేడుపాక రమేశ్, భిక్షపతి, కార్యదర్శి ఎన్ శ్రీనివాస్, గ్రేటర్ వరంగల్ సీనియర్ నాయకుడు బీ అశోక్ కుమార్ తదితరులున్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా సహాయ ఎన్నికల అధికారి పింకేశ్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా సహాయ ఎన్నికల అధికారి పింకేశ్‌కుమార్

జనగామ చౌరస్తా, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జనగామ జిల్లా సహాయ ఎన్నికల అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన తన చాంబర్‌లో ఎంసీఎంసీ, సోషల్ మీడియా, కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గానికి 3 ఫ్లయింగ్, 3 స్టాటిస్టికల్, 3వీడియో సర్వేలైన్స్ చొప్పున మొత్తం 27బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన నివేదికను ప్రతిరోజూ సమర్పించాలని ఆదేశించారు. కాల్ సెంటర్ నిరంతరాయంగా పని చేయాలని, నమోదైన కాల్స్ వివరాలను తెలుపాలన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా నమోదైన ఫిర్యాదుల నివేదికను అందించాలన్నారు. అలాగే స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ఓటు హక్కు విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పింకేశ్‌కుమార్ సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్, ఈడీఎం దుర్గారావు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర జలవనరుల కమిషన్ సభ్యులు

రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

కేంద్ర జలవనరుల కమిషన్ బృందం సభ్యులు

పాలకుర్తి రూరల్ , మార్చి 21 : రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఢిల్లీకి చెందిన సెంట్రల్ వాటర్ కమిషన్ బృందం డిప్యూటీ డైరెక్టర్ ధీరజ్ అన్నారు. మండలంలోని చెన్నూరు రిజర్వాయర్ పనులను గురువారం జల వనరుల కమిషన్ బృందం సభ్యులు పరిశీలించారు. రిజర్వాయర్ కట్ట, లోతు, విస్తీర్ణం పరిశీలించి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వాయర్ పనుల్లో వేగాన్ని పెంచి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చి ఆయకట్టుకు సాగునీరందించాలన్నారు. డిసెంబర్ 25 వరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. వారివెంట నీటిపారుదల శాఖ ఈఈ ప్రవీణ్, డీఈ శ్రీకాంత్‌శర్మ, ఏఈఈ శశిధర్, పూర్ణచందర్ ఉన్నారు.

కోర్టు ఏర్పాటుకు ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న జడ్జి రవీందర్‌శర్మ

త్వరలోనే కోర్టును ఏర్పాటు చేస్తాం

- జిల్లా జడ్జి రవీందర్ శర్మ
- ఎస్సీ హాస్టల్ భవనం పరిశీలన

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 21 : స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో త్వరలోనే జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేస్తామని జిల్లా జడ్జి రవీందర్ శర్మ అన్నారు. గురువారం ఆయన బస్టాండ్ సమీపంలో నిరుపయోగంగా ఉంటున్న ఎస్సీ హాస్టల్‌ను కోర్టు ఏర్పాటు కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవనానికి మరమ్మతులు చేసి కోర్టు ను ప్రారంభిస్తామని తెలిపారు. జడ్జి వెంట ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, సీఐ రాజు, బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్, బైరపాక జయాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్, ప్రధాన కార్యదర్శి పిల్లి కార్తీక్, అడ్వకేట్ గద్దె అనిల్ ఉన్నారు.



చిన్నం నర్సింహులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా

ప్రతి కార్యకర్తకు అండగా బీఆర్ఎస్

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, మార్చి 21 : ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని సాయిరామ్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త చిన్న నర్సింహులు దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. నర్సింహులు కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. నాయకులు పోకల లింగయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బీటీ రోడ్డు పనులు పూర్తిచేయాలని నిరసన

రఘునాథపల్లి, మార్చి 21 : మండలంలోని మండెలగూడెం నుంచి పోతరాజుతండా వరకు బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ ఇరు గ్రామాల ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20రోజుల క్రితం కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర పోసి వదిలేశాడని, దీంతో బావుల వద్దకు, జనగామకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బైక్‌పై వెళితే కంకరలో వాహనాలు నడవడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో మరీ కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పుప్పాల వేణు, గాదె సిద్దేశ్వర్, తోట నరేశ్, పొన్నాల ఆంజనేయులు, మెతుకు సాయికృష్ణ పాల్గొన్నారు.

'కొమ్మూరి'పై ఫిర్యాదు చేయడం అవివేకం

నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ నరేశ్

మాట్లాడుతున్న కిసాన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నరేశ్

బచ్చన్నపేట, మార్చి 21 : ఇరవై ఏళ్లుగా జనగామ, చేర్యాల ప్రాంతానికి అందుబాటులో ఉంటున్న మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డిపై కొందరు కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌లో ఫిర్యాదు చేయడం అవివేకమని జనగామ నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేశ్ అన్నారు. గురువారం ఆయన బచ్చన్నపేటలో మాట్లాడుతూ అన్నం పెట్టే వారికి సున్నం పెట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారని, పార్టీ ఓటమికి కారణమైన వారే ఈ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట బీసీసెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి శ్రీనివాస్, కొండ బాబు, మహేందర్, నాగయ్య, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

50 ఏండ్ల వారికి పింఛన్ అందించాలి

టైలర్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి

మాట్లాడుతున్న టైలర్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి తిరుపతి

బచ్చన్నపేట, మార్చి 21 : మండలంలోని అన్ని గ్రామాల్లో టైలర్ వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న 50ఏండ్ల వారికి పింఛన్ వర్తింపజేయాలని టైలర్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి తిరుపతి కోరారు. గురువారం ఆయన బచ్చన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో టైలర్స్ సంఘం సభ్యులు పాల్గొన్నారని గుర్తు చేశారు. అప్పటి నుంచి కొట్లాడినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే వడ్డీ లేని రుణాలందించాలన్నారు. ప్ర భుత్వం విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంల ఆర్డర్లను గ్రామీణ టైలర్స్‌కు ఇ వ్వాలని, ఇందిరమ్మ ఇ ల్లు మంజూరు చేయాలని తిరుపతి కోరారు. సమావేశంలో నర్సింహులు, సుధాకర్, నర్సింగరావు, రమేశ్ పాల్గొన్నారు.

మొరం తరలిస్తే చర్యలు తప్పవు

జేసీబీ సీజ్.. ముగ్గురిపై కేసు నమోదు

బచ్చన్నపేట, మార్చి 21 : అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవని బచ్చన్నపేట ఎస్సై సతీశ్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తరలించడం నేరమన్నారు. కొన్నె గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వుతున్నట్లు వచ్చిన సమాచారంతో అక్కడికి వెళ్లి జేసీబీని స్వాధీనం చేసుకుని ఓనర్ వేముల లక్ష్మణ్‌తో పాటు డ్రైవర్లు చెరుకు కృష్ణారెడ్డి, పసుల గురులింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

బచ్చన్నపేట, మార్చి 21 : చెక్‌పోస్టు వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనీశ్ సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రం, కొన్నె చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను మభ్య పెట్టేందుకు డబ్బులు తరలించే అవకాశం ఉన్నందున తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్సై సతీశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- ఏడుగురు విద్యార్థుల గైర్హాజరు
- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మార్చి 21 : జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 6,698మంది విద్యార్థులకు 6,691మంది పరీక్ష రాశారని, ఏడుగురు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కే రాము తెలిపారు. జనగామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ తనిఖీ చేశారు. అలాగే దేవరుప్పుల మండలం చిన్నమడూరు జడ్పీహెచ్ఎస్, లింగాలఘనపురం మోడల్ స్కూల్, నెల్లుట్ల జడ్పీహెచ్ఎస్, జనగామ పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్, శాన్ మారియా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెంబర్తి జడ్పీహెచ్ఎస్‌ను డీఈవో రాము సందర్శించారు. జిల్లాలోని మరో 14పరీక్ష కేంద్రాలను రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. వసతులపై అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతోపాటు సిబ్బందినీ తనిఖీ చేయాలి..

- అనంతరమే కేంద్రాల్లోకి అనుమతించాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 21 : విద్యార్థులతో పాటు పరీక్షల విధుల్లో ఉన్న చీఫ్ సూపరింటెండెంట్లు, డీవోలు, ఇతర సిబ్బందిని తనిఖీ చేశాకే కేంద్రాల్లోకి అనుమతించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని వైద్య శిబిరాన్ని పరిశీలించి వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులుండాలని, సెల్‌ఫోన్లతో ఎవరినీ అనుమతించొద్దని, ప్రహరీ సరిగాలేని సెంటర్ల వద్ద భద్రతను పటిష్టం చేయాలన్నారు. పరీక్షలు జరుగుతున్న తీరును ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.